మహిళా సంఘర్షణ సమితి కమిటీ ఎన్నిక

ఎదులాపురం, సెప్టెంబర్ 26 : మహిళలపై జరుగుతున్న అన్యాయాలపై గొంతుకనై ఉద్యమాలు నిర్వహించేందుకు మహిళా సంఘర్షణ సమితి కమిటీ ఎన్నుకున్నామని ఎన్నికైన అధ్యక్షురాలు కుమ్ర పద్మ తెలిపారు. గురువారం ఆదిలాబాద్ లోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎన్నికైన కమిటీ సభ్యులను ప్రకటించారు. ప్రధాన కార్యదర్శిగా కాంతాబాయి, కోశాధికారిగా టర్పే తులసి, నాయకులు శిరీష, లక్ష్మి, సుశీలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు. మహిళల రక్షణకు నిరంతరం మహిళా సంఘర్షణ సమితి కృషి చేస్తుందన్నారు.

రథ నిర్మాణానికి విరాళం

బోథ్, సెప్టెంబర్ 26: సొనాల శ్రీ సీతారామచంద్ర స్వామి వారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా రథం కోసం గురువారం ఆలయ కమిటీ చైర్మన్, దక్షిణ మధ్య రైల్వే బోర్డు సభ్యుడు జీవీ రమణ రూ.50 వేల విరాళం అందజేశారు. రథ నిర్మాణంలో వీటిని వినియోగించాలని సూచించారు. చైర్మన్‌తో పాటు గ్రామానికి చెందిన విశ్రాంత ఉపాధ్యాయుడు పీ నర్సయ్య రామాలయ బ్రహ్మోత్సవాల నిర్వహణ కోసం తనవంతుగా రూ.20 వేలు విరాళం ప్రకటించారు.

సత్యాగ్రహ దీక్షను విజయవంతం చేయండి

నిర్మల్ అర్బన్, సెప్టెంబర్ 26 : నిర్మల్‌లోని ఆర్డీవో కార్యాలయం ఎదుట ఈ నెల 30వ తేదీన ఉదయం 10 గంటలకు నిర్వహించే సత్యాగ్రహ దీక్షను విజయవంతం చేయాలని నవ సంఘర్షణ రాష్ట్ర అధ్యక్షుడు ఆప్క గజేందర్ యాదవ్ పిలుపునిచ్చారు. గురువారం నిర్మల్‌లోని ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీసీలంతా ఏకం కావాలని చట్ట సభల్లో, స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్లు బీసీలకు అమలు చేయాలన్నారు. ఈ సత్యాగ్రహ దీక్షకు పలువురు హాజరవుతున్నారని తెలిపారు. జిల్లాలోని బీసీ కుల సంఘాలు, నాయకులు, మహిళలు, రైతులు పాల్గొనాలని కోరారు. సమావేశంలో నాయకులు గంగిరెడ్డి నర్సారెడ్డి, లింగన్న, మల్లేశ్ పాల్గొన్నారు.

మైనార్టీ గురుకులంలో బాలశక్తి

సారంగాపూర్, సెప్టెంబర్ 26: చించోలి(బీ) గ్రామంలోని మైనార్టీ గురుకులంలో గురువారం బాలశక్తి కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులు సమస్యలు వచ్చినప్పుడు మానసికంగా కృంగిపోకుండా ధైర్యంగా ఉండాలని నిపుణుడు సురేశ్‌కుమార్ తెలిపారు. సలహాలు తీసుకొని ఇష్టపడి చదువాలని, మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో జిల్లా స్థాయి సమన్వయకర్త జ్యోతి, ప్రిన్సిపాల్, అధ్యాపకులు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనలో కేజీబీవీ విద్యార్థులు

దిలావర్‌పూర్, సెప్టెంబర్ 26 : నిర్మల్‌లో జరిగిన జిల్లా స్థాయి వైజ్ఞానిక మేళాలో దిలావర్‌పూర్ కేజీబీవీ విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. స్టోరీ రైటింగ్ విభాగంలో జిల్లా స్థాయిలో ప్రథమ బహుమతి మీనాక్షి, యూత్ సైన్స్‌మేళా విభాగంలో బీ అర్చన టీం జిల్లా స్థాయి టాప్ 5లో నిలిచినట్లు ఆ పాఠశాల ప్రిన్సిపాల్ అపర్ణ తెలిపారు. టాప్ 5లో నిలిచిన అర్చన టీం రాష్ట్ర స్థాయికి ఎంపికైనట్లు పేర్కొన్నారు. వీరిని పాఠశాల ఉపాధ్యాయ బృందంతో పాటు ఎంఈవో శంకర్ అభినందించారు.

విద్యార్థులకు బహుమతులు అందజేత

ఎదులాపురం, సెప్టెంబర్ 26 : ఆదిలాబాద్ అర్బన్ పొచ్చర ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఏకలవ్య ఫౌండేషన్ ఎడ్యుకేషన్, ప్రాజెక్ట్ విద్య వాహిని ఆధ్వర్యంలో విద్యార్థులకు నిర్వహించిన పోటీల్లో గెలుపొందిన వారికి గురువారం బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా ప్రాజెక్ట్ ఇన్‌చార్జి హరీశ్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్, సిబ్బంది కృష్ణ పాల్గొన్నారు.

నూతన కార్యదర్శిగా రాథోడ్ కైలాస్

నర్సాపూర్ (జీ), సెప్టెంబర్ 26 : నర్సాపూర్ (జీ) గ్రామ పంచాయతీ కార్యదర్శిగా రాథోడ్ కైలాస్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేసిన కార్యదర్శి వీణ రెడ్డి డిప్యూటేషన్‌పై రత్నాపూర్ కాండ్లికి వెళ్లారు. రత్నాపూర్ కాండ్లిలో పని చేసిన రాథోడ్ కైలాస్‌కు నర్సాపూర్(జీ) గ్రామ పంచాయతీ కార్యదర్శిగా వచ్చారు. ఆయనను ఎంపీవో తిరుపతి రెడ్డి అభినందించారు.

పీహెచ్‌సీలో పరిశుభ్రతను పాటించాలి

ఇంద్రవెల్లి, సెప్టెంబర్ 26 : ప్రభుత్వ దవాఖానల్లో పరిశుభ్రతను పాటించాలని ఎంపీడీవో భాస్కర్ అన్నారు. గురువారం ఇంద్రవెల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని పీహెచ్‌సీలో పంచాయతీ అధికారులతో పాటు పారిశుధ్య కార్మికులు వైద్య పరీక్షలు చేశారు. కార్యక్రమంలో ఎంపీవో సమీర్‌హమద్, ఈవో సంజీవ రావ్, బిల్ కలెక్టర్ గంగారాం, సిబ్బంది పాల్గొన్నారు.

స్వచ్ఛతా హీ సేవాలో భాగస్వాములు కావాలి

సారంగాపూర్, సెప్టెంబర్ 26 : ప్రభుత్వం ప్రవేశ పెట్టిన స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని జడ్పీ సీఈవో గోవింద్ అన్నారు. గురువారం కౌట్ల(బీ) గ్రామంలో నిర్వహించిన స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. గ్రామాలను పరిశుభ్రంగా ఉంచుకుంటే ఎలాంటి వ్యాధులు ప్రబలవని సూచించారు. అనంతరం మల్టీపర్పస్ వర్కర్లకు పారిశుధ్య కిట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో లక్ష్మీకాంతారావు, ఎంపీవో అజీజ్‌ఖాన్, డాక్టర్ వేదవ్యాస్, మాజీ జడ్పీటీసీ పత్తిరెడ్డి రాజేశ్వర్‌రెడ్డి, ఏపీవో లక్ష్మారెడ్డి, ఏపీఎం మాధురి, పాల్గొన్నారు.

మహిళల సంపూర్ణ ఆరోగ్యానికి చర్యలు

నిర్మల్ చైన్‌గేట్, సెప్టెంబర్ 26 : మహిళల సంపూర్ణ ఆరోగ్యానికి చర్యలు తీసుకోవాలని జిల్లా వైద్యారోగ్యాధికారి రాజేందర్ అన్నారు. జిల్లా వైద్యాధికారి కార్యాలయంలో జిల్లాలోని మహిళ ఆరోగ్య సహాయకులకు అమ్మకోసం శిక్షణ కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో మాట్లాడుతూ గర్భిణుల్లో ఆరోగ్య సమస్యలు నివారించడానికి అదేవిధంగా మాతృ మరణాలు తగ్గించడానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలు, నాణ్యమైన వైద్య సేవలందించడానికి ఈ శిక్షణ కార్యక్రమాలు ఉపయోగపడతాయన్నారు. హైదరాబాద్ నుంచి వచ్చిన కన్సల్టెంట్ డాక్టర్ సంతోషిణి, డాక్టర్ అఖిల, టీవోటీ డాక్టర్ శ్యాంకుమార్, అరుణ్‌కుమార్ శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో మెటర్నల్ హెల్త్ నోడల్ ఆఫీసర్ డాక్టర్ సౌమ్య, డీపీహెచ్ఎన్‌వో సాయమ్మ, జిల్లాలోని ఆరోగ్య సహాయకులు పాల్గొన్నారు.

పాట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం పేరు మార్పు నిర్ణయం వెనక్కి తీసుకోవాలి

భైంసా, సెప్టెంబర్ 26 : పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం పేరు మార్పు నిర్ణయం వెనక్కి తీసుకోవాలని ఆర్యవైశ్య సంఘం జిల్లా అధ్యక్షుడు విలాస్ గాదేవార్ అన్నారు. గురువారం భైంసాలోని ఆర్డీవో కార్యాలయంలో ఆర్డీవో కోమల్ రెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం పొట్టి శ్రీరాములు విశ్వవిద్యాలయం పేరును మారుస్తూ సురవరం ప్రతాప రెడ్డి తెలుగు విశ్వవిద్యాలయంగా మంత్రివర్గం చేసిన ఆమోదాన్ని ఖండిస్తున్నామన్నారు. ఈ నిర్ణయం పట్ల తెలంగాణ ఆర్యవైశ్యుల మనోభావాలు దెబ్బతింటున్నాయన్నారు. వెంటనే ఈ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు శ్రీశైలం దర్బార్, సెక్రటరీ గోపి గుజ్జుల్‌వార్, కోశాధికారి శివకుమార్, సంతోష్, సందీప్, రాజేష్, డాక్టర్ మహిపాల్, సాయినాథ్, సురేశ్, తదితరులు పాల్గొన్నారు.

ఎదులాపురం: చాకలి ఐలమ్మ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న బీఆర్ఎస్ నాయకులు



ఎదులాపురం: విగ్రహానికి పూలమాల వేస్తున్న మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్

బోథ్‌లో..

చాకలి ఐలమ్మకు నివాళి

ఎదులాపురం/బోథ్/తాంసి/ఇచ్చోడ/గుడిహత్నూర్/తలమడుగు/బజార్‌హత్నూర్/నేరడిగొండ/ఉట్నూర్‌రూరల్, సెప్టెంబర్ 26 : చాకలి ఐలమ్మ జయంతి సందర్భంగా ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా గురువారం ఆమెకు ఘనంగా నివాళులర్పించారు. జిల్లా కేంద్రంలో, మండల కేంద్రాలు, గ్రామాల్లో ఆమె చిత్రపటాలు, విగ్రహాలకు నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఐలమ్మ మహిళా శక్తి ప్రతీక అని, భూమి కోసం సాయుధ పోరాటాలు చేసి దొరలు, భూస్వాములు, దేశ్‌ముఖ్‌ల అహంకార పాలనకు వ్యతిరేకంగా ఉద్యమించిన ధీరురాలు అని కొనియాడారు. కార్యక్రమాల్లో అధికారులు, రజక సంఘం నాయకులు, వివిధ పార్టీల నాయకులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

నిర్మల్‌అర్బన్/సోన్/దిలావర్‌పూర్/లక్ష్మణచాంద/నర్సాపూర్ (జీ)/భైంసా/భైంసాటౌన్/ముథోల్/కుంటాల/దస్తురాబాద్, సెప్టెంబర్ 26: తెలంగాణ వీర వనిత చాకలి ఐలమ్మ పోరాట స్ఫూర్తిని ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని వక్తలు అన్నారు. నిర్మల్ జిల్లా వ్యాప్తంగా చాకలి ఐలమ్మ జయంతి సందర్భంగా ఆమె విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.



ముథోల్: చాకలి ఐలమ్మ విగ్రహానికి పూలమాల వేస్తున్న ఎమ్మెల్యే రామారావు పటేల్

ఉట్నూర్ రూరల్: మాట్లాడుతున్న ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్

కుంటాల: నివాళులర్పిస్తున్న నాయకులు

నిర్మల్‌అర్బన్: నివాళులర్పిస్తున్న ఎస్పీ, పోలీసులు

కేంద్రమంత్రులను కలిసిన ఎంపీ

కేంద్రమంత్రి రాజ్‌నాథ్ సింగ్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఎంపీ నగేశ్

ఎదులాపురం, సెప్టెంబర్ 26 : ఆదిలాబాద్‌లో ఎయిర్‌ఫోర్స్ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని ఎంపీ నగేశ్ గురువారం ఢిల్లీలో కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. జిల్లా కేంద్రంలో రక్షణ శాఖకు చెందిన 369 ఎకరాల భూమి ఉందని, గతంలో రాష్ట్ర ప్రభుత్వం 1592 ఎకరాల భూమిని గుర్తించిందని వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి సహకారం అందించడానికి సుముఖంగా ఉందని, మంత్రి తమ శాఖ అధికారులకు తగు ఆదేశాలు జారీ చేయాలన్నారు. మూతపడిన సీసీఐని తెరిపించేలా చర్యలు తీసుకోవాలని కేంద్ర పరిశ్రమల శాఖ మంత్రి కుమారస్వామిని కలిసి విన్నవించారు. జైనూర్ ఘటనలో ఆదివాసులపై పెట్టిన కేసులను ఎత్తివేసేలా రాష్ట్ర ప్రభుత్వానికి ఆదేశాలు జారీ చేయాలని జాతీయ ఎస్టీ కమిషన్ అంతర్ సింగ్ ఆర్యను కలిసి విన్నవించారు. ఎంపీ వెంట స్థానిక ఎమ్మెల్యే పాయల్ శంకర్ ఉన్నారు.

టీబీ కల్చర్ ల్యాబ్ పరిశీలన

ల్యాబ్‌ను పరిశీలిస్తున్న కేంద్రం బృందం సభ్యులు

ఎదులాపురం, సెప్టెంబర్ 26: ఆదిలాబాద్‌లోని టీబీ కల్చర్ డీఎంసీ ల్యాబ్‌ను కేంద్ర బృందం సభ్యులు గురువారం పరిశీలించారు. ల్యాబ్‌లో జరుగుతున్న వ్యాధి నిర్ధారణ పరీక్షల గురించి అడిగి తెలుసుకున్నారు. నాణ్యంగా నిర్ధారణ పరీక్షలు చేయాలని సూచించారు. తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. వారి వెంట టీబీ జిల్లా అధికారి సుమలత, ప్రమోద్ కుమార్, కేంద్ర బృందం సభ్యులు డాక్టర్ అజ్జర్, రాష్ట్ర టీబీ ఎపిడెమియాలజిస్ట్ డాక్టర్ రాజేశ్వరి, దినేశ్, రాధిక, సుధాకర్ ఉన్నారు.

అంబులెన్స్ వాహనాల తనిఖీ

బేల, సెప్టెంబర్ 26 : బేలలోని 102, 108, 1962 వాహనాలను గురువారం క్వాలిటీ ఆడిటింగ్ అధికారి కిశోర్, ఉమ్మడి జిల్లా ప్రోగ్రాం మేనేజర్ సాగ్రూట్ తనిఖీ చేశారు. వాహనాలకు సంబంధించిన రికార్డులు, పరికరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉద్యోగులు ప్రతి రోజూ గ్రామాల్లోకి వెళ్లే సమయంలో గర్భిణులు, రోగులను తరలించే సమయంలో తప్పకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. కార్యక్రమంలో పైలెట్ ఆర్షద్ ఖాన్, సిబ్బంది సాయితేజ, సాయి కిరణ్, అజీమ్, సత్యనారాయణ, కోటేశ్వర్లు పాల్గొన్నారు.

ఇచ్చోడ(సిరికొండ), సెప్టెంబర్ 26: సిరికొండ మండలానికి చెందని 108 వాహనాన్ని క్వాలిటీ చెకింగ్ అధికారి కిశోర్, ఉమ్మడి జిల్లా మేనేజర్ సాగ్రూట్ తనిఖీ చేశారు. వాహనంలోని రికార్డులను, పరికరాలను మందులను పరిశీలించారు. వాహనం కండిషన్, అందుబాటులో ఉంటూ ప్రజలకు అందిస్తున్న సేవలకు అభినందించారు.కార్యక్రమంలో ఈఎంఈ రాజశేఖర్, సిబ్బంది, ఈఎంటీ కాశీనాథ్, పైలెట్ గోపినాథ్ పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

ఎదులాపురం, సెప్టెంబర్ 26 : ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని ప్రభుత్వ దవాఖానల్లో పని చేస్తున్న కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఏఐటీయూసీ రాష్ట్ర ఉపప్రధాన కార్యదర్శి నర్సింహా, జిల్లా ప్రధాన కార్యదర్శి సిర్ర దేవేందర్ గురువారం హైదరాబాద్‌లో డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ (డీఎంఈ) వాణిని కలిసి వినతిపత్రం అందజేశారు. సమాన పనికి సమాన వేతనం, కాంట్రాక్టర్‌తో పీఎఫ్, ఈఎస్ఐ కట్టించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. స్పందించిన డీఈఎంఈ సమస్యలు పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

పోలీస్ స్టేషన్ తనిఖీ

లక్ష్మణచాంద, సెప్టెంబర్ 26: మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌ను గురువారం సీఐ నవీన్ కుమార్ తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. పాత కేసుల వివరాలు తెలుసుకున్నారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చిన బాధితులకు ఎటువంటి ఇక్కట్లు కలగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆయన వెంట ఎస్ఐ సుమలత, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

నూతన డిగ్రీ కళాశాల పరిశీలన

ముథోల్, సెప్టెంబర్ 26 : ప్రభుత్వం ఇటీవల నూతనంగా ముథోల్‌కు డిగ్రీ కళాశాల మంజూరు చేసింది. గురువారం ఎమ్మెల్యే రామారావు పటేల్ డిగ్రీ కళాశాలను పరిశీలించారు. గదులను తిరుగుతూ విద్యార్థులకు ఏర్పాటు చేయాల్సిన సౌకర్యాల గురించి అడిగి తెలుసుకున్నారు. ముథోల్ డిగ్రీ కళాశాలలో విద్యార్థుల సౌకర్యార్థం కోసం అన్ని వసతులు కల్పిస్తామని తెలిపారు. ఆయన వెంట బీజేపీ మండలాధ్యక్షుడు కోరి పోతన్న, మాజీ జడ్పీటీసీలు రమేశ్, లక్ష్మీనర్సాగౌడ్, మాజీ ఎంపీటీసీలు దేవోజీ భూమేశ్, ఉత్సవ కమిటీ అధ్యక్షుడు రోళ్ల రమేశ్, గౌరవాధ్యక్షుడు సుదర్శన్, వీడీసీ అధ్యక్షుడు నారాయణ, నాయకులు ఉన్నారు.

బాధిత రైతులకు పరిహారం..

భైంసా, సెప్టెంబర్ 26 : ఇటీవల భారీ వర్షాలకు భైంసా మండలం బడ్‌గాం గ్రామానికి చెందిన జోగ్‌దాండే భోజరాంకు చెందిన పశువు విద్యుత్ షాక్‌తో మృతి చెందగా ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ రూ.32 వేల చెక్కును అందజేశారు. అదేవిధంగా ముథోల్ మండలం మచ్కల్ గ్రామానికి చెందిన సూర్యవంశీ సదాశివ్ పటేల్ గేదె మృతి చెందగా రూ.50 వేల చెక్కును అందజేశారు. కార్యక్రమంలో పశువైద్యాధికారి విఠల్ పాల్గొన్నారు.

ముగిసిన శిక్షణ తరగతులు

ఇచ్చోడ/దిలావర్‌పూర్, సెప్టెంబర్ 26 : ఇచ్చోడ, దిలావర్‌పూర్‌లోని మండల పరిషత్ కార్యాలయంలో మిషన్ భగీరథ ఏఈఈ జైపాల్ ఆధ్వర్యంలో గ్రామ మంచినీటి సహాయకులకు నాలుగు రోజులుగా నిర్వహిస్తున్న శిక్షణ తరగతులు గురువారం ముగిశాయి. వివిధ అంశాలపై అవగాహన కల్పించారు. నీటి నాణ్యత నిపుణులు తిరుపతి బోర్ నుంచి వచ్చే నీరు, మిషన్ భగీరథ ద్వారా వచ్చే నీరు, ఆర్‌వో నీరు తాగడం వల్ల ఆరోగ్యానికి కలిగే నష్టాన్ని పరీక్షించి చూపించారు. అనంతరం గ్రామ మంచినీటి సహాయకులకు సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీడీవోలు లక్ష్మణ్, అరుణరాణి, మిషన్ భగీరథ ఈఈ చంద్రమోహన్, ఏఈఈ జైపాల్, ఎంపీవో గోవర్ధన్ పాల్గొన్నారు.

అకాల వర్షం.. అన్నదాతకు నష్టం

బజార్‌హత్నూర్, సెప్టెంబర్ 26: బజార్‌హత్నూర్‌లో రెండు రోజులుగా కురుస్తున్న అకాల వర్షాలతో పంటలకు నష్టం వాటిల్లుతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చేతికి వచ్చిన సోయా, మొక్కజొన్న పంటల్లో నీటి నిలువలు ఉండడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని పేర్కొన్నారు. నష్టపోయిన పంటలకు ప్రభుత్వం చేయూత అందించాలని వారు కోరారు.

భీంపూర్, సెప్టెంబర్ 26 : భీంపూర్ మండలంలోని నిపాని, లక్ష్మీపూర్ నడుమ, అంతర్గాం వద్ద చిన్న వాగులకు వరద చేరడంతో వాహనదారులు ఇబ్బంది పడ్డారు. పెన్‌గంగ గుబిడి, అంతర్గాం, తాంసి(కే) రేవుల నుంచి నాటుపడవలను బంద్ చేశారు.

వృద్ధుల ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి

నిర్మల్ చైన్‌గేట్, సెప్టెంబర్ 26 : వృద్ధుల ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ అన్నారు. అంతర్జాతీయ వయోవృద్ధుల వారోత్సవాల్లో భాగంగా నిర్మల్‌లోని డవ్ వృద్ధాశ్రమంలో గురువారం వృద్ధులకు పండ్లు పంపిణీ చేశారు. వారి బాగోగులు, ఆశ్రమంలో సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు. ఏమైనా సమస్యలుంటే తన దృష్టికి తీసుకురావాలని సిబ్బందిని ఆదేశించారు. వృద్ధులకు ఆటల పోటీలు నిర్వహించారు. వృద్ధుల దినోత్సవం రోజున బహుమతులు అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ ఆజస్ అహ్మద్, మూర్తి, సూపర్‌వైజర్ విజయగౌరి, డీసీపీవో మురళి, ఎఫ్ఆర్‌వో మధుసూదన్, డవ్ సూపరింటెండెంట్ రాము, వృద్ధులు పాల్గొన్నారు.

యువజన ఉత్సవాల్లో ప్లేయర్ విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న కరస్పాండెంట్ నర్సింహారెడ్డి, ప్రిన్సిపాల్

దిలావర్‌పూర్, సెప్టెంబర్ 26 : జిల్లా స్థాయి యువజనోత్సవాల్లో భాగంగా నిర్మల్‌లో జరిగిన జిల్లా స్థాయి సైన్స్‌ఫేయిర్‌లో సిర్గాపూర్ గ్రామంలోని ప్లేయర్ హైస్కూల్ విద్యార్థులు ప్రతిభను కనబర్చారు. ఇందులో భాగంగా అడెపు పూజ క్రాఫ్ట్‌లో ప్రథమ బహుమతి, కే దీప్తి క్రాఫ్ట్‌లో తృతీయ బహుమతి, పెయింటింగ్‌లో మనీషా తృతీయ బహుమతి, మహితారెడ్డి వచన కవిత్వంలో తృతీయ బహుమతి సాధించినట్లు పాఠశాల కరస్పాండెంట్ నర్సింహారెడ్డి తెలిపారు. వీరు జిల్లా కేంద్రంలో అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ చేతుల మీదుగా బహుమతులు అందుకున్నారు. విద్యార్థులను పాఠశాల బృందం శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

దసరా నవరాత్రి ఉత్సవాలకు ఆహ్వానం

బాసర, సెప్టెంబర్ 26 : అక్టోబర్ 3 నుంచి 12వ తేది వరకు నిర్వహించే దసరా నవరాత్రి ఉత్సవాలకు సంబంధించిన ఆహ్వాన పత్రికను గురువారం ఆలయ ఈవో విజయ రామారావుతో పాటు అధికారులు, అర్చకులు ముథోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్, భైంసా కోర్టు న్యాయమూర్తి దేవేంద్రబాబు, ఏఎస్పీ అవినాశ్ కుమార్‌కు అందజేశారు. ఉత్సవాలకు రావాలని ఆహ్వానించారు.

గోండ్ లిపి పండితుల మృతి తీరని లోటు

నివాళులర్పిస్తున్న ఐటీడీఏ పీవో ఖుష్బూగుప్తా

నార్నూర్, సెప్టెంబర్ 26 : గోండ్ లిపి పండితుల మృతి తీరని లోటని ఐటీడీఏ పీవో ఖుష్బూగుప్తా అన్నారు. గురువారం గుంజాల గ్రామంలో వారి చిత్రపటాలకు పూలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పీవో మాట్లాడుతూ గోండి లిపి పండితులు కోట్నాక జంగు, ఆర్క జైవంత్‌రావ్ మృతి చెందడం బాధకరమని అన్నారు. వారి సేవలు చిరస్మరణీయమని అన్నారు. అనంతరం వారి కుటుంబ సభ్యులకు సానుభూతి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ఆత్రం భాస్కర్, మానిక్‌రావ్, పేసా కోఆర్డినేటర్ వసంత్‌రావ్, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

పెండింగ్ పనులు త్వరగా పూర్తిచేయాలి

ఉట్నూర్ రూరల్, సెప్టెంబర్ 25: పెండింగ్ పనులు త్వరగా పూర్తి చేయాలని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్ అన్నారు. గురువారం ఉట్నూర్‌లోని క్యాంపు కార్యాలయంలో పంచాయతీరాజ్, ట్రైబల్ వెల్ఫేర్ ఇంజినీరింగ్ అధికారులతో సమావేశం నిర్వహించారు. పెండింగ్‌లో ఉన్న పనులు, బిల్లుల గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ అధికారుల ప్రజలకు అందుబాటులో ఉండి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని అన్నారు. అభివృద్ధి విషయంలో ఎలాంటి జాప్యం చేయవద్దని అన్నారు. నియోజక వర్గ అభివృద్ధి కోసం లక్ష్యంగా పని చేయాలని అన్నారు. కార్యక్రమంలో ఐటీడీఏ టీడబ్ల్యూ ఈఈ భీంరావ్, అధికారులు పాల్గొన్నారు.

టీవీటీని గ్రామ పంచాయతీగా ఏర్పాటు చేయాలి

బోథ్, సెప్టెంబర్ 26: టీవీటీ గ్రామాన్ని పంచాయతీగా ఏర్పాటు చేయాలని మాజీ ఎంపీపీ తుల శ్రీనివాస్ ఆధ్వర్యంలో గ్రామస్తులు గురువారం ఆదిలాబాద్‌లో కలెక్టర్ రాజర్షి షాను కలిసి విన్నవించారు.పార్డి(కే) గ్రామ పంచాయతీలో కలపడం మూలంగా దూరభారం పెరిగిందన్నారు. సుమారు 450 వరకు జనాభా ఉన్నందున కొత్త పంచాయతీగా ఏర్పాటు చేయాలని కోరారు.

కడెంలో బతుకమ్మ సంబురాలు

బతుకమ్మ సంబురాల్లో డీఆర్డీవో విజయలక్ష్మి, ఐకేపీ సిబ్బంది

కడెం, సెప్టెంబర్ 26 : కడెంలోని ఎంపీడీవో కార్యాలయ సమీపంలో గురువారం స్వచ్ఛత హీ సేవా కార్యక్రమంలో భాగంగా బతుకమ్మ సంబురాలు నిర్వహించారు. డీఆర్డీవో విజయలక్ష్మి, ఐకేపీ, ఈజీఎస్, ఎంపీడీవో కార్యాలయ సిబ్బంది ఆటాపాటలతో కోలాటాలతో బతుకమ్మ వేడుకలను నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీవో కవిరాజ్, ఈజీఎస్ ఏపీవో జయదేవ్, ఏపీఎం రాజారాం, సిబ్బంది పాల్గొన్నారు.

ఆత్మీయ సమ్మేళనం

2006-07 పదో తరగతి బ్యాచ్ విద్యార్థులు

కుంటాల, సెప్టెంబర్ 26 : కుంటాల మండలం ఓలాలోని గండె శంకర్ మెమోరియల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2006-07లో పదో తరగతి పూర్తి చేసిన విద్యార్థులు గురువారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. మాజీ సర్పంచ్ ఖానీస్ ఫాతిమా, మాజీ ఎంపీటీసీ రవి, మాజీ కోఆప్షన్ సభ్యుడు హైమద్ పాషా, పూర్వ ఉపాధ్యాయులు మోహన్ రావు, దాసరి రమేశ్, రమేశ్ చందర్ గౌడ్, మారుతి, తదితరులు పాల్గొన్నారు.

జోనల్ స్థాయి పోటీలకు విద్యార్థినులు ఎంపిక

సోన్, సెప్టెంబర్ 26 : నిర్మల్‌లోని రాంనగర్ ఆశ్రమ పాఠశాల (బాలికలు)లోని చదువుతున్న విద్యార్థినులు అండర్-14, 17లో ఉట్నూర్‌లో నిర్వహించే జోనల్ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు ఆర్ తుకారాం, పీడీ ఎం రాంజీ తెలిపారు. స్థానిక ఆశ్రమోన్నత పాఠశాల(బాలుర) నందు డివిజన్ స్థాయి స్పోర్ట్స్‌మీట్ జరగగా ఇందులో గిరిజన ఆశ్రమ పాఠశాలలో చదువుతున్న 13 మంది విద్యార్థులు వివిధ రకాల పోటీల్లో ఎంపికయ్యారు. అండర్-17 కబడ్డీలో బీ గౌతమి, హెత్మ, సోని, నందిని (10వ), అండర్-17 ఖోఖోలో జీ చెంచులక్ష్మి, డీ రూపిక, టెన్నికాయి సంధ్య, అండర్-14 కబడ్డీలో ఆర్ రమ్య, ఆర్ గాయత్రి, ఆర్ అంజలి, టెన్నికాయిట్‌లో జే శోభ, క్యారమ్స్‌లో వీ గౌరి ఎంపికయ్యారు. వీరిని ఉపాధ్యాయులు అభినందించారు.

వాగులో కొట్టుకుపోయిన పశువులు మృతి

సారంగాపూర్, సెప్టెంబర్ 26: సారంగాపూర్ మండలం తాండ్ర(జీ) గ్రామానికి చెందిన జాదవ్ అరవింద్ పశువులు వాగులో కొట్టుకుపోయి మృతి చెందాయి. బాధితుడు తెల